క్లుప్తంగా

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



ములకలాపల్లిలో గౌరీ పరమేశ్వర్లను దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: ములకలాపల్లి బంటు వారి కల్లాల్లోని గౌరీ పరమేశ్వరుల ఆలయ 4వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవార జాము నుంచి గ్రామస్తులు గౌరీ పరమేశ్వర్లను దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ పురోహితులు పాకల కామేశ్వరరావు, విశ్వనాథం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

భూముల రీసర్వేకు నోటీసులు



కె.జె.పురం సచివాలయంలో రీసర్వే నోటీసులు అందిస్తున్న సర్వేయర్లు

మాడుగుల రూరల్ : కె.జె.పురం రెవెన్యూ పరిధిలో చేపట్టిన భూములు రీసర్వేకు సంబంధించి 90 నోటీసులను రైతులకు అందజేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్, మాసాల్లో గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీసర్వే చేపట్టారు. 1815 ఎకరాలకు సంబంధించి, 2000 మంది రైతులకు నోటీసులు అందజేస్తున్నట్టు స్థానిక రీసర్వే డీటీ గణపతిరావు బుధవారం తెలిపారు. గ్రామ సచివాలయంలో ఈ నోటీసులను అందజేస్తున్నామని, ఇంతవరకూ 800 మందికి నోటీసులు అందజేశామని తెలిపారు.మండల సర్వేయరు రెడ్డి తవిటినాయుడు, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

చీడిగుమ్మల పీఏసీఎస్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



ప్రమాణస్వీకారం చేసిన సత్యనారాయణ

గొలుగొండ : చీడిగుమ్మల పీఏసీఎస్ అధ్యక్షుడుగా చీడిగుమ్మల గ్రామానికి చెందిన బీమిరెడ్డి సత్యనారాయణ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, మండల టీడీపీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు. డైరక్టర్లుగా నందిపల్లి వెంకటరమణ, పైల స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు.

చురుగ్గా కింతలి విద్యుత్ ఉపకేంద్రం పనులు



కింతలిలో నిర్మాణంలో వున్న విద్యుత్ ఉపకేంద్రం

మాడుగుల రూరల్ : కింతలిలో నూతనంగా చేపట్టిన విద్యుత్ ఉపకేంద్రం పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఉపకేంద్రం వల్ల కింతలి, వల్లాపురం, అవురువాడ, పోన్నవోలు, జాలంపల్లి, గ్రామాలకు విద్యుత్ సేవలు లభిస్తాయని మండల విద్యుత్ ఏఈ ఎం.రాంబాబు బుధవారం తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు వేయడానికి దమ్ములు



వీరవల్లి అగ్రహారంలో వరినాట్లు కోసం పట్టి తోలుతున్న రైతు

మాడుగుల రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు వరినాట్లు వేయని పంట భూముల్లో ప్రస్తుతం వరినాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. ప్రధానంగా మెట్ట భూముల్లో వరి నాట్లు వేయడానికి, రైతులు దమ్ములు దున్ని, పట్టి తోలుతున్నారు. కె.జె.పురం, వి.వి.అగ్రహారం, కింతలి, ఒమ్మలి, వీరనారాయణం, తదితర గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నర్సీపట్నం : ఐటీఐల్లో ప్రవేశాలకు మూడో విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో సర్టిఫికెట్లు వెరిఫిషన్ చేయించుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27న మధ్యాహ్నం గంటలోపు ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.



ప్రైవేటు భవనంలో నడుస్తున్న వడ్డాది బీసీ బాలుర వసతి గృహం

- శిథిలావస్థలో దిబ్బిడి, పరాయి పంచన వడ్డాది హాస్టళ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

సొంతగూడు లేని వసతి గృహాలు



శిథిలావస్థలో దిబ్బిడి వసతి గృహం



వర్షం వస్తే తడిచి ముద్దవుతున్న దిబ్బిడి వసతి గృహం



దిబ్బిడిలో శ్లాబు పెచ్చులూడిపడుతున్న గదులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల బీసీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుచ్చెయ్యపేట పక్కన దిబ్బిడి వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 2005లో ఏర్పాటు చేసిన ఈ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఏ మాత్రం వర్షం కురిసిన నీరు లీకై విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సుమారు 120 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తూ వసతి పొందుతున్నారు. శ్లాబు నీరు లీకుతో పాటు బీటలు వారి పెచ్చులు ఊడి మీద పడుతున్నాయి. పలు గదుల్లో శ్లాబు పెచ్చులూడి పడడంతో ఇక్కడ విద్యార్థులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భయపడుతున్నారు. 30 ఏళ్లుగా మేజర్ పంచాయతీ వడ్డాదిలో బీసీ బాలుర వసతి గృహం పరాయి పంచన నడుస్తుంది. వడ్డాది సంతబయలు దారిలో ఉండే ప్రైవేటు వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరి వర్షం నీరు లీకవడంతో పాటు శ్లాబు పెచ్చులూడిపడుతున్నాయి. చాలీచాలనీ మరుగుదొడ్లు, బాత్‌రూంలతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడేవారు. ఎపుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గుర్తించిన అధికారులు ఇటీవల వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి ప్రక్కన ఉన్న మరో ప్రైవేటు భవనంలోకి వసతి గృహాన్ని మార్పు చేశారు. గతంలో వడ్డాది బీసీ బాలుర వసతి గృహంలో 120 మందికి పైగా విద్యార్థులుండగా ప్రైవేటు శిథిల భవనం కావడంతో విద్యార్థుల సంఖ్య 50 లోపే పడిపోయింది. విద్యార్థుల సంఖ్యకు తగ్గ మరుగుదొడ్లు, బాత్ రూంలు, ఫ్యాన్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం, మంచినీటి క్లోరినేషన్ వంటి సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ బాలుర వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యా బోధనలు సక్రమంగా అందేలా చూడాలని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం చూపుతున్నారు..



దిబ్బిడిలో బీసీ బాలుర వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నా కుమారుడిని వసతి గృహంలో చేర్పించడంతో భయందోళన చెందాం. విద్యార్థుల నదుపాయాల పట్ల సరైన పర్యవేక్షణ లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రు. సొంత భవనం ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

– నైదాన రాజు, విద్యార్థి తండ్రి

చిన్నచూపు తగదు



బీసీలంటే చిన్నచూపు చూస్తున్నారు. మండలంలో ఉన్న రెండు బీసీ వసతి గృహాలు ప్రైవేటు భవనంలో నడుస్తున్నా అధికారులు, నాయకులు సొంత భవనాలు నిర్మించాలన్న ధ్యాస చూపడం లేదు. బీసీ కులాల పిల్లలకు ఉన్నత చదువులు అందించడానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

– జోగా కొండబాబు, మండల బీసీ సంఘం నాయకుడు

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



సీతయ్యపేటలో నిరసనలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

బుచ్చెయ్యపేట: సర్కార్ నిర్ణయం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలంటూ బుధవారం సీతయ్యపేట మూడు రోడ్ల జంక్షన్‌లో దుర్గాభవాని ఆటో యూనియన్ సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు ఆదాయ మార్గాలు లేక పస్తులుంటున్నామన్నారు. వాహనమిత్ర ద్వారా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ, 15 వేలు నగదు అందించాలని, ఆర్టీసీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆటో డ్రైవర్, మోటారు కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం,పెన్షన్ సదుపాయాలు కల్పించాలని అన్నారు. బ్యాంకుల నుంచి పావలా వడ్డీకి రుణాలు అందించాలని, గోతుల రోడ్లు బాగు చేసి ప్రయాణికులకు సుఖప్రయాణం కల్పించాలని కోరారు. ఆటో యూనియన్ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు అక్కిరెడ్డి నరిశింగరావు,పిల్లా రాజు,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోరుబిల్లి జగదీష్ పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

దేవరాపల్లి : ఇటీవల విస్తారంగా కురిసిన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన పశువైద్య సిబ్బందికి సత్కారం



పశువైద్య సహాయకులను సత్కరిస్తున్న ఏడీ దినేష్‌కుమార్, పశువైద్యాధికారులు

కె.కోటపాడు: అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే వారికి పాడి రైతుల మన్ననలు దక్కుతాయని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ.దినేష్‌కుమార్ అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో పని చేసి వేరే ప్రాంతాలకు బదిలీ అయిన పశువైద్యాధికారులతో పాటు పశు వైద్య సహాయకులను బుధవారం స్థానిక ఏడీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మూగజీవాలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత పశువైద్య సిబ్బందిపై ఉందని దినేష్ కుమార్ అన్నారు. పశువైద్యంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను పాడి రైతులకు సకాలంలో అందజేయాలన్నారు. బదిలీ అయిన పశువైద్యాధికారులు సిహెచ్.వై.నాయుడు, సంహాచలంనాయుడు, గాయత్రీదేవి, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, గోపి, త్రినాథ్, శివ, లింగేశ్వరరావు, ఆదర్శ్, సాయికుమార్‌లను ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. పశువైద్యాధికారులు మంజూష, ప్రియాంక, బుజ్జి, వెంకటరావు, సమీరా, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులు అందరికీ అందాలి



కార్యవర్గ సభ్యులతో వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ ఎస్.మోజెష్

కె.కోటపాడు : ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు అన్ని వర్గాల వారికి దక్కేలా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సభ్యులు పర్యవేక్షణ ఉండాలని ఏపీ హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ ఎస్.మోజెష్ అన్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ కార్యవర్గంలో నియమితులైన ఉమ్మడి విశాఖపట్నంకు చెందిన వారితో కె.కోటపాడులో బుధవారం సమావేశం నిర్వహించారు. వీరికి వర్కింగ్ ప్రెసిడెంట్ మోజేష్ నియామక పత్రాలను అందించారు. వారు చిత్తశుద్ధితో వారి భాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. హ్యూమన్ రైట్స్ జాతీయ కార్యదర్శి ఫక్కి చందన్, ప్రేమ్‌కుమార్ మహంతి, ఉపాధ్యక్షుడు బిషప్ శ్యామూల్‌లోపింటి పాల్గొన్నారు.

క్వారీ లీజు రద్దు చేయాలి



మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీకి వినతిపత్రం అందజేస్తున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడూరు రాయి క్వారీ లీజు రద్దు చేయాలని కోరుతూ గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీకి వినతిపత్రం అందజేశారు. అనుమతులు రద్దు చేయాలంటూ ఆర్డీవో కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరాహారదీక్షల్లో భాగంగా గురువారం పెదబొడ్డేపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి, బీఎస్పీ రాష్ట్ర నాయకుడే బొట్టా నాగరాజు మాట్లాడుతూ 29 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు దళిత రైతుల ఆవేదన పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మైనింగ్ మాఫియాను అరికడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక క్వారీ అనుమతులు మంజూరు చేయడం అన్యాయమన్నారు. వెంటనే క్వారీ అనుమతులు రద్దు చేయాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్‌లతో నిఘా



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న రూరల్ సీఐ రేవతమ్మ

గొలుగొండ : అసాంఘిక కార్యక్రమాలపై గొలుగొండ పోలీసులు ఆధ్వర్యంలో డ్రోన్‌లతో పరిశీలన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీతకండి, ఏటిగైరంపేట, వెంకటాపురం, కోడులపాలెం తదితర గ్రామాల్లో ఉన్న పరిసరాలు వద్ద డ్రోన్‌లతో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రామారావుతో పాటు సిబ్బంది పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వలు ఏమైనా ఉన్నాయా, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచారు. అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ రేవతమ్మ, ఎస్ఐ రామారావు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలిరండి



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ : సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని, దీనికి అన్ని వర్గాల ప్రజలు సహకారం ఇవ్వాలని కోరుతూ కృష్ణదేవిపేటలో బుధవారం గోడపత్రికలు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల శాఖ కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. గంజాయి అక్రమ రవాణా వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. వీటిన్నింటిపై మహాసభల్లో చర్చలు జరిపి ప్రజల్లోకి సమస్యలు తీసుకువెళుతున్నట్టు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు గడువు ఈ నెల 26వ తేదీ కాగా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ఈనెల 27వ తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, కుల, ఆదాయ ధ్రువ పత్రాలతో పాటు పాస్ ఫోటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నెంబరు, ఆధార్ కార్డ్‌తో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు.

దోమలతో వ్యాపించే వ్యాధులను అరికడదాం



దేవరాపల్లిలో ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి డా. డి.వనజ, వైద్య సిబ్బంది



ఆనందపురంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి శైలజ



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నాతవరం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

దేవరాపల్లి : దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సమష్టిగా కృషి చేయాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారం పైబడిన నీటి నిల్వలను తొలగించాలని, ఇళ్లల్లో దోమల మందు పిచికారి చేయడంతో పాటు దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ర్యాలీలో సిహెచ్‌వో ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, స్టాఫ్ నర్స్ కళావతి, ఏఎన్ఎం మరియమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : దోమల వ్యాప్తి జరగకుండా ప్రజలు వైద్య సిబ్బంది వివరించే సూచనలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆనందపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. మురుగునీటిలో వారానికి ఒక రోజు కిరోసిన్ లేదా వాడిన పాత ఇంజిన్ ఆయిల్‌ను వేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి, మలేరియా, డెంగ్యూ వ్యాధులను నివారించవచ్చన్నారు. పీహెచ్ఎన్ ప్రమీల, ఎంపీహెచ్ఈవో శంకరరావు, హెల్త్ సూపర్‌వైజర్ హిక్సయా, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ : దోమలు వ్యాప్తి చెందకుండా అన్ని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, దీనికి ప్రజల సహకారం ఉండాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా గొలుగొండలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం : రోగాలు రాకుండా ఉండాలంటే ఇళ్ల పరిసరాలలో దోమలు లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని నాతవరం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి సంతోషకుమార్ అన్నారు. నాతవరం మెయిన్‌రోడ్డుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ ద్వారా విషజ్వరాలను అరికట్టవచ్చని, దీనిపై ప్రజల్లో చైతన్యం తేవాలని అన్నారు. ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, పీహెచ్ఏ త్రివేణి, హెల్త్ అసిస్టెంటు బైరాగి, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో రాజీవ్ గాంధీ జయంతి




మాడుగులలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కొండలరావు తదితరులు

మాడుగుల రూరల్ : మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మాడుగులలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఏసురాజు, పార్టీ నాయకులు అమరయ్యగుప్తా పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 26వ తేదీవరకు అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో స్వీకరించడం జరుగుతుందన్నారు. బీఎస్సీలో కెమిస్ట్రీ–40, జువాలజీ–40, కంప్యూటర్ సైన్స్–40, ఫిజిక్స్, కంప్యూటర్‌సైన్స్–40సీట్లు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బిఏ విభాగంలో ఎకనామిక్స్– 60, బీకాం కంప్యూటర్స్–60 సీట్లు ఉన్నాయని తెలిపారు. మొత్తం 280 సీట్లు చోడవరం డిగ్రీ కాలేజీకి ఓఎఎండీసీ మంజూరు చేసిందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్స్ సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8247470250, 9966545448 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు మరిడమ్మ తల్లి పండగ



నాతవరం : స్థానిక మరిడమ్మ తల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరిడమ్మ తల్లి పండగను ఏటా ఆగస్టులో జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. అమ్మవారి పండగను ఘనంగా జరుపుకొంటే పాడి పంటలు బాగా పండుతాయని నమ్మకం. పండగను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ఎంబీ పట్నం, మర్రిపాలెం, డి.యర్రవరం, వై.బి.పట్నం, గన్నవరం గ్రామాల్లో కూడా అమ్మవారి పండగకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పంటపొలాల్లో నీటిని తొలగించాలి



చిననందిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు

దేవరాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు నీటి మునిగిన పొల్లాలో నీటిని తక్షణమే తొలగించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు డా. ఆదిలక్ష్మి, డా. ఉమామహేశ్వరరావు సూచించారు. చిననందిపల్లి, పెదనందిపల్లి, కాశీపురం గ్రామాలలో స్థానిక వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి బుధవారం పర్యటించారు. వర్షాలకు నీటి మునిగిన పొలాలను పరిశీలించారు. వరి పొలాల్లో నీరు పూర్తిగా తగ్గాక ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ కలిపి పొలంలో చల్లాలన్నారు. తద్వారా పంట బాగా ఎదుగుతుందన్నారు. చెరకు పంటలో సైతం నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు.

నేడు దొండపూడిలో దుర్గాలమ్మ పండగ

- రాష్ట్ర స్థాయి వాలీబాల్, మహిళా కబడ్డీ పోటీలు
- ఉత్తరాంధ్ర జిల్లాలు క్విజ్ పోటీల నిర్వహణ



రావికమతం : దొండపూడి గ్రామ ఆరాధ్య దైవం, దుర్గాలమ్మ అమ్మవారి పండగ గురువారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయి వాల్‌బాల్, మహిళల కబడ్డీ పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు అందజేయనున్నట్టు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గ్రామస్తుల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని ఈ నెల 14 వ తేదీన ప్రారంభించారు. కాగా గురువారం జరిగే పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ జాతరకు హాజరవు తున్నారు.

మహిళా రైతులతో డెయిరీల ఏర్పాటు

మాడుగుల : గ్రామాలులో మహిళా పాడి డైరీలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చేయూత నిస్తుందని, మాడుగుల పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. గ్రామాల్లో 11 మంది మహిళా రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి పాలు సేకరించి వారికి నచ్చిన డెయిరీకి పాలు సరఫరా చేసుకోవచ్చున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.రెండు లక్షలు వరకు పరికరాలు సరఫరా చేస్తుందన్నారు. సభ్యుల్లో ఒకరు కార్యదర్శిగా ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళా పాడి రైతులు మరిన్ని వివరాలకు దగ్గరలో పశువైద్యశాలను లేదా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఏడీ సూచించారు.